క్లుప్తంగా

గంగమ్మకు ప్రత్యేక పూజలు

పలమనేరు: తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా ఆరోరోజైన మంగళవారం స్థానిక గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పట్టణానికి చెందిన గాండ్ల కులస్తులు, నాయీ బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో పూజలు, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


మృతి చెందిన దిప్పున్

సదుం: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ షేక్‌షావలి మంగళవారం తెలిపారు. స్థానిక రామమందిరం వద్ద రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు ఒడీశా వాసులు సోమవారం గాయపడటం విదితమే. తీవ్రంగా గాయపడ్డ ఒడీశా రాష్ట్రం కథక్ జిల్లా విరాదా తాలుకా గాడి జంజీర్‌కు చెందిన దిప్పున్(20)ను చికిత్స నిమిత్తం పీలేరుకు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి అతను మరణించాడు. మృతుని తల్లి వేపూరి ప్రదాశ్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ : మోటార్ సైక్లిస్టుకు గాయాలు

సదుం: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో మోటార్ సైక్లిస్టు గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు.. సోమల మండలం పెద్ద ఉప్పరపల్లెకు చెందిన మాధవయ్య ద్విచక్రవాహనంలో సదుం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యంలోని గొంగివారిపల్లె పంచాయతీలో ఓ ప్రైవేటు స్కూల్ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు అతడిని ఢీకొంది. గాయపడిన మాధవయ్యను 108 అంబులెన్సులో పీలేరుకు తరలించారు.

భక్తులతో బోయకొండ కిటకిట


బోయకొండలో భక్తుల రద్దీ.

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీబోయకొండ గంగమ్మ ఆలయంలో మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు అమ్మవారిని సుందరంగా అలంకరణ చేసి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో ఏకాంబరం ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చౌడేపల్లె: మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ బూటకపల్లె సమీపంలోని పూలకుంట చెరువు వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. రహస్య సమాచారం మేరకు పేకాట స్థావరాలపై దాడులు చేయగా రవి (వీరప్పల్లె), మధు, పరీద్‌ఖాన్, నాగరాజ (రాజులూరు) పట్టుపడ్డారు. వారి నుంచి పోలీసులు రూ.5100 స్వాధీనం చేసుకుని నిందితులను పుంగనూరు కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

బాల్య వివాహాలు నిరోధించాలి


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సదుం: ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే నిరోధించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం రెడ్డివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చేస్తే కలిగే అనర్థాలను వివరించారు. కిశోర బాలికలకు మంచి పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. సర్పంచ్ హనుమంత రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అనిల్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే సంతృప్తి

వి.కోట: సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని ఎండీహెచ్ సంస్థ అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయుగార్డెన్-1లోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు, భారత్ నగర్‌లోని సంఘమిత్ర వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే ప్యాకెట్లు అందజేసి ఆయన మాట్లాడారు. పేదలను చేతనైంత ఆదుకోవడమే తమ సంస్థ ఉద్దేశమన్నారు.

వ్యవసాయ పరికరాల పంపిణీ


పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్, అధికారులు

శాంతిపురం: రాయితీపై సుమారు రూ.15 లక్షల విలువైన వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీటీడీ బోర్డు డైరెక్టర్ శాంతారాం పంపిణీ చేశారు. మంగళవారం మండల వ్యవసాయాధికారి కార్యాలయం వద్ద 24 మంది రైతులకు ట్రాక్టర్ మడకలు, రొటావేటర్లు, స్ప్రేయర్లను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అప్పోజి, వ్యవసాయ సిబ్బంది, అధికార పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మూలన పడేశారు 'బాబూ'..!

- వైఎస్సార్ సీపీ పాలనలో రాక..
- కూటమి పాలనలో పంపిణీకి నోచుకోక..
- సచివాలయాల్లో మూలుగుతున్న 15 వేల చెత్తబుట్టలు!
- నెలల కాలంగా పంపిణీ చేయని వైనం
- చెత్త సేకరణ కేంద్రాల వద్ద హడావుడే తప్ప ఆచరణేదీ?

చెత్తసేకరణ కేంద్రాలతో సంపద సృష్టిస్తాం. పంచాయతీలకు ఆదాయ వనరులు కల్పిస్తాం. గ్రామాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.. ప్రతినెలా మూడవ శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర పేరిట పరిశుభ్రత ప్రాధాన్యత ఇస్తున్నాం..అంటూ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చినప్పటినుంచి ఊదరగొడుతోంది. మరోవైపు ఇదే రీతిలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులందరూ పొటోలకు ఫోజులిచ్చి, వారి ఫోన్లలోని యాప్‌లలో ఫొటోలు అప్‌లోడ్ చేసి అరచేతిలో పారిశుధ్య స్వర్గం చూపిస్తున్నారు. తీరా గ్రామాలకు వెళ్లి పరిశీలిస్తే వాస్తవ పరిస్థితులు మరోలా ఉంటున్నాయి.



DISTRIBUTION OF DUSTBINS TO HOUSEHOLDS

Name of the mandal	Name of the GP	No. of 10 Ltrs BINS received from SAC	No. of 10 Ltrs Bins supplied to House Hold	Remarks
[illegible]	[illegible]	[illegible]	[illegible]	[illegible]

పంచాయతీల వారీగా చెత్తబుట్టలు పంపిణీ చేసినట్లు అధికారుల నివేదిక


శెట్టిపేట పంచాయతీ కేంద్రంలోని స్టాకు రూములో మూలన పడేసిన దృశ్యం


చారాల సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి గదిలో మూలన పడేసిన చెత్తసేకరణ ప్లాస్టిక్ డబ్బాలు

చౌడేపల్లె: ప్రతి ఇంటా చెత్త సేకరణ కోసం గత ప్రభుత్వ పాలనలో ఒక కుటుంబానికి రెండేసి ప్లాస్టిక్ డస్ట్‌బిన్లు(చెత్త బుట్టలు) ఇచ్చేందుకు పూనుకుంది. వీధుల్లో, రోడ్లలో ఎక్కడ బడితే అక్కడ చెత్త పడేయకుండా తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేసి వీటిని పంచాయతీ సిబ్బందికి ఇవ్వాలన్నదే దీని ఉద్దేశం. ఈ క్రమంలో చౌడేపల్లె మండలానికి సుమారు 15 వేల చెత్త డబ్బాలు అప్పట్లో మండల పరిషత్ కార్యాలయానికి వచ్చాయి. ఆ సమయంలో ఎన్నికల కోడ్ ఉండడంతో పంపిణీ చేయకుండా అధికారులు కార్యాలయంలోనే వాటిని భద్ర పరిచారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిని ఆయా సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులకు సూచనలిచ్చి స్టాకును అప్పగించేసి ఎంపీడీఓ, ఈఓ పీఆర్డీలు చేతులు దులుపుకున్నారు. అంతే అంతటితో వీటి కథ ముగిసింది. మూడునెలలైనా చెత్త డబ్బాలు పంపిణీ చేయకుండా ఆయా గ్రామాల సచివాలయాల కేంద్రాల్లో నిరుపయోగంగా మూలన పడేశారు. చౌడేపల్లె టౌన్‌లో ఇంటింటికీ నామమాత్రంగా ఒకటి మాత్రమే పంపిణీ చేసి మమ అనిపించారు. మండలంలోని మిగిలిన 18 గ్రామ పంచాయతీల్లో పంపిణీ చేయలేదు. వాస్తవానికి ప్రతి ఇంటా బుట్టల్లో వేసిన తడి, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్(పంచాయతీ కార్మికులు)కు ఇవ్వాలి. అయితే వీటిని పంపిణీ చేయకుండా గ్రామాల్లోని సచివాలయాల్లోని గదుల్లో, రైతు సేవా కేంద్రాల్లో నిల్వ చేయడంతో దుమ్ము కొట్టుకుపోతున్నాయి. ఉన్నతాధికారులైనా జోక్యం చేసుకొని ఇంటింటికీ తడిచెత్త, పొడి చెత్త సేకరణకు చెత్త బుట్టలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీస్ బోర్డు

- **మైనారిటీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి**

పుంగనూరు: మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తులు ఆ వర్గాల యువతీ యువకులు తమ సర్టిఫికెట్లతో చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 25లోపు సంబంధిత సచివాలయాలలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

వి.కోట: బాలింతలు, గర్భవతులు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ కార్యకర్త అరుణ అన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిషోర బాలికలకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పౌష్టికాహారం ,పోషక విలువలున్న ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు.

కోనేటిరాయుని చిద్విలాసం

- చిన్నశేష, హంస వాహనాలపై విహారం




చిన్నశేష వాహనం, హంస వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు మంగళవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేతంగా కోనేటిరాయస్వామి నందగోపాలకృష్ణుడి అవతారంలో చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అంతకు ముందు ఉదయం సుప్రభాతసేవ, తోమాలసేవ, అర్చన, చందన పుష్ప తాంబూలాలతో అభిషేకించి శ్రీవారి నైవేద్య ఘంటానాదం అనంతరం స్వామివారికి నైవేద్యం సమర్పించారు. ఆ తరువాత సతీసమేతంగా స్వామివారు తిరుచ్చిపై విహరించారు. మధ్యాహ్నం ఉభయ దేవేరులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఉయ్యాల సేవ నిర్వహించారు. పలువురు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. రాత్రి శ్రీనివాసుడు విద్యాప్రదాత సరస్వతీదేవిగా అవతరించి, శ్రీదేవి భూదేవి సమేతంగా హంస వాహనంలో కొలువుదీరి, మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాటాలు, భజన బృందాల నడుమ మాడవీధుల్లో విహరించారు. అడుగడుగునా భక్తులు టెంకాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. మూడవ రోజు బుధవారం ఉదయం శ్రీవారు సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనాల్లో విహరిస్తారని ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కంకణ భట్టార్ ఏకే. నరసింహాచార్యులు, డిప్యూటీ స్పెషల్ గ్రేడ్ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతి గంగమ్మ జాతర చాటింపు


చాటింపు సందర్భంగా ఆలయం వద్ద భక్తుల సందడి


ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమాంబ

కుప్పం: పట్టణంలో శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర చాటింపు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కొడిమాను పూజ, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు పూజా కార్యక్రమాలు కొనసాగించారు. మధ్యాహ్నం అమ్మవారికి అంబలి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. రాత్రి చాటింపును సరిహద్దులు చుడుతూ డప్పువాయిద్యాల మధ్య నిర్వహించారు.

ఏర్పాట్లలో వైఫల్యం..భక్తులకు ఇబ్బందులు

జాతర చాటింపు కార్యక్రమానికి భారీగా భక్తులు తరలివచ్చారు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచే ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడితో పాటు పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కుప్పం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి జనం పెద్దత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారికి అంబలి నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేయటం ఆనవాయితీ. ఈ క్రమంలో మధ్యాహ్నం భక్తులు తీసుకువచ్చిన అంబలిని పంపిణీ చేసేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా భక్తులకంటే అమ్మవారి దర్శనానికి కూటమి ప్రభుత్వం, పాలకవర్గ సభ్యుల బంధువర్గం, స్నేహితులకే అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా సోషల్ మీడియాలో కొందరు పాలకవర్గ సభ్యులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు చాటింపుకు రావాలని ఆహ్వానించి పోస్టులు పెట్టడంతో దేవస్థానాల్లో రాజకీయ ప్రస్తావన ఏమిటని కొందరు అహసనం వ్యక్తం చేశారు.

గాలీవాన బీభత్సం

- నేలకొరిగిన టమాట, బంతిపూల తోటలు
- మోట్ల చేనులో కూలిన పశువుల షెడ్డు


దెబ్బతిన్న టమాటా పంట


నేల కూలిన షెడ్డు

కుప్పం రూరల్: కుప్పం మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి గాలీవాన బీభత్సం సృష్టించింది. టమాట, బంతి పూల తోటలకు నష్టం వాటిల్లింది. నేరేడు చెట్లు సైతం నేల కూలాయి. సోమవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసినా అర్ధరాత్రి జోరుగా కురవడంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. దాదాపు 20 ఎకరాల్లో టమాట, 45 ఎకరాల్లో బంతి పూలతోటలు నేలకొరిగాయి. అక్కడక్కడ నేరేడు చెట్లు నేల కూలి నష్టాన్ని మిగిల్చింది. మోట్లచేను, మల్లానూరు, అడవిబూదుగూరు ప్రాంతాల్లో పెను గాలులు ధాటికి 20 ఎకరాల్లో టమాట పంట నేల రాలింది. బంగారునత్తం, మల్లానూరు, గోపనపల్లె బంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. అసలే ధరలు పతనమై రైతులు సతమతమతవుతున్న వేళ గాలీవాన మరింత దెబ్బకొట్టింది. మోట్లచేనులో మల్లప్పకు చెందిన నేరేడు చెట్లు నేలకూలాయి. అలాగే, ఆయన టమాట పంట సైతం నష్టపోయాడు. ఇదే గ్రామానికి చెందిన అన్నాదొరై పశువుల షెడ్డు నేల కూలి రూ.40 వేల ఆస్తినష్టం వాటిల్లింది. బాధితులు తమను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆస్పత్రిలో 'సమాచారం' నిల్..!


ఏరియా ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డ్యూటీ డాక్టర్ల వివరాలు నమోదు చేయాల్సిన బోర్డు

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార బోర్డులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. మున్సిపాలిటీ కార్యాలయంలో ఏకంగా కమిషనర్ పేరు లేకనే చాలా కాలంగా బోర్డు ఖాళీగా దర్శనమిచ్చింది. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలోనూ ఇదే తీరులో సమాచార బోర్డు వెక్కిరిస్తోంది. ఇక్కడ డ్యూటీ డాక్టర్లు, నర్సులు, ఇతర వివరాలు నమోదు చేయాల్సిన బోర్డులు సైతం ఖాళీగా దర్శనమిస్తున్నాయి. సోమవారం హెల్త్ సెక్రెటరీ కృష్ణబాబు తనిఖీ చేస్తున్న సమయంలో కూడా డ్యూటీ డాక్టరు వివరాల బోర్డు ఖాళీగానే దర్శనమివ్వడం గమనార్హం! ఇక ఈ బోర్డుల్లో సమాచారం ప్రత్యక్షమయ్యేదెన్నడో..!?

ధరలేక రోడ్డుపై పారబోసిన టమాట


కల్లూరు సమీపంలో రోడ్డు పక్కన పారబోసిన టమాటాలు

పులిచెర్ల(కల్లూరు): రెండు నెలలుగా టమాట పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల పాలయ్యారు. ఎకరా సాగుకు మూడు లక్షల వరకు ఖర్చు అయితే దిగుబడి వచ్చేసరికి 20 కేజీల బాక్సు కేవలం రూ.70 నుంచి రూ.80 వరకే పలుకుతుండడం, కోత కూలీలు కూడా రాకపోవడంతో కొందరు రైతులు పొలాల్లోనే పంట వదిలేస్తున్నారు. కొందరు రైతులు చివరకు టమాటాలను రోడ్డు పక్కన పారబోయడం చూస్తే ధరల పతనం ఎంతగా దెబ్బతీసిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

వాసవిమాతకు ముత్యాలచీర అలంకరణ


ముత్యాలచీర అలంకారంలో వాసవి కన్యకా పరమేశ్వరిదేవి

పుంగనూరు: పట్టణంలో బజారువీధిలోని శ్రీవాస కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో నిర్వహిస్తున్న జయంతి మహోత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారిని ముత్యాలచీరలో అలంకరించి, పుష్పాలతో తీర్చిదిద్ది, హోమాలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నిమ్మకాయల దీపాలు పెట్టి, మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

కిశోర బాలికలు పరిశుభ్రత పాటించాలి


కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న జయంతి

గుడుపల్లె: కిశోర బాలికలు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయంతి అన్నారు. మంగళవారం యామగానిపల్లె, కనమనపల్లెలో కిశోరి వికాసం సమ్మర్ క్యాంపు కార్యక్రమాన్ని నిర్వహించారు. 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలకు రుతుక్రమ పరిశుభ్రత, లైంగిక విద్యపై అవగాహన కల్పించారు. రుతుక్రమ అనేది స్త్రీ శరీరంలో సహజమైన ప్రక్రియ అని, ఈ సమయంలో జాగ్రత్తలు పాటించడం అవసరం అన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, జీఎంఎస్‌కేలు, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

నైతిక విలువలు.. సమాజానికి దీప్తులు


శిక్షణా తరగతులలో పిల్లలు

- నీతి కథలు వినేందుకు ఆసక్తిగా వెళుతున్న బాలబాలికలు
- కళా మందిరంలో వేసవిశిక్షణ శిబిరానికి మంచి స్పందన

పలమనేరు: వేసవి సెలవులు వచ్చాయంటే పిల్లలు ఎగిరి గంతేస్తారు. గతంలో అయితే పిల్లలు రకరకాల ఆటలాడేవారు. మారిన పరిస్థితుల కారణంగా ఇప్పుడు చిన్నారుల నుంచి పిల్లల వరకూ చేతిలో సెల్ ఉండాల్సిందే. స్మార్ట్‌ఫోన్‌ను చూస్తూ ఆకలేసినా పట్టించుకోకుండా వారి లోకంలో వారుంటున్నారు. అయితే విద్యార్థి దశలోనే వారికి నైతిక విలువలు, మన సంస్కృతి సాంప్రదాయాలు, నీతి కథలు, పద్యాలను నేర్పిస్తే సత్ప్రవర్తనతో నడచుకునేందుకు, బాధ్యతాయుత పౌరులుగా వ్యవహరించేందుకు ఇది సోపానమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు కళామందిరంలో పిల్లలకు వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నారు. 30మంది పైగా పిల్లలు హాజరవుతున్నారు.



రోజుకో పద్యం నేర్చుకుంటున్నా

నన్ను మా అమ్మానాన్న ఈ వేసవి సెలవుల్లో ఇక్కడికి పంపిస్తున్నారు. ఇక్కడ రోజుకో నీతి పద్యం నేర్చుకుంటున్నా. ఇక్కడ సార్లు చెప్పే నీతి కథలు చాలా ఆసక్తిగా ఉంటున్నాయి. ఆ కథలను నేను మా ఇంట్లో వాళ్లకి రాత్రుల్లో చెబుతున్నాను. –బేరి వాణి, పలమనేరు



పద్యాలు పాడి బహుమతులు గెలుచుకున్నా

నేను మూడేళ్లుగా ప్రతి వేసవి శిక్షణా తరగతులకు వస్తున్నా. ఇప్పటికే చాలా పద్యాలు, నీతి కథలను నేర్చుకున్నా. వీటిని పలుచోట్ల పాడి బహుమతులు కూడా గెలుచుకున్నా. ఇక్కడ చెప్పే కథలంటే చాలా ఇష్టం.

–మోక్ష, సీనియర్ విద్యార్థి



బడిలో కూడా మంచి గుర్తింపు

వేసవి శిక్షణలో నేను నేర్చుకున్న పద్యాలు, కథలు బడిలో కూడా నాకు గుర్తింపు తెస్తున్నాయి. పద్యం చెప్పడమే కాదు దానికి అర్థం కూడా చక్కగా చెబుతాను. దీంతో అందరికీ పద్యం, తాత్పర్యం బాగా అర్థమవుతోంది. అందుకే ఆసక్తిగా శిక్షణకు వెళుతున్నా. –తేజస్విని, పలమనేరు



ఇక్కడ ఎలాంటి భయం లేదు

బడిలో అయితే టీచర్లు చెప్పే హోంవర్క్., నోట్‌వర్క్ లుంటాయి. కానీ ఇక్కడ అలాకాదు.. హాయిగా కథలు వింటూ వాటిని గుర్తు పెట్టుకుంటున్నా. పద్యాలు తక్కున చెప్పగలుగుతున్నా. మామూలు బడికంటే ఇక్కడే బాగుంది.

–దివ్య, పలమనేరు